సాక్షి మంచిర్యాల

గురువారం । 3 । ఆగస్టు । 2023



వైద్యం.. అందని దైన్యం

బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రి నిర్వహణ గాడితప్పింది. ఫలితంగా వైద్యం అందని దైన్యం నెలకొంది. 250 పడకల ఆస్పత్రి 75 పడకలకే పరిమితమైంది.

8లో▸

ఈసెట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఈసెట్ కౌన్సెలింగ్‌కు 131 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈసెట్‌లో సాధించిన ర్యాంకు ప్రాతిపదికన విద్యార్థులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. సదరు విద్యార్థుల విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించి ధ్రువీకరించారు. అనంతరం కౌన్సెలింగ్ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0 /26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు సిద్ధం



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ అదనపు కలెక్టర్లు బి.రాహుల్, మోతిలాల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమిలతో కలిసి జిల్లా అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం 2023, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపు దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు, మంచిర్యాల ఆర్డీవో వి.రాములు, ఎన్నికల డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

మంచిర్యాలఅగ్రికల్చర్: సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాకు పలువురు తహసీల్దార్లు వచ్చారు. కొత్తవారికి పోస్టింగ్‌లు కేటాయిస్తూ కలెక్టర్ బి.సంతోష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా మండలాలకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లు రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. జిల్లా కలెక్టరేట్ ఏఓ పి.రాజేశ్వర్, మందమర్రికి కె.చంద్రశేఖర్, చెన్నూర్‌కు భోజన్న, లక్సెట్టిపేటకు టి.రాఘవేంద్రరావు, జన్నారానికి కె.వనజారెడ్డి, దండేపల్లికి ఎ.సంధ్యారాణి, నస్పూర్‌కు ఇమ్రాన్‌ఖాన్ పఠాన్, కోటపల్లికి బి.మహేంద్రనాథ్, హాజీపూర్‌కు పి.సతీష్‌కుమార్, మంచిర్యాల ఆర్డీఓ ఆఫీసర్ తహసీల్దార్‌గా బి.దాస్, భీమారానికి బత్తుల విశ్వంబర్, నెన్నెలకు షేక్ ఖరీం, తాండూర్‌కు వెంకటలక్ష్మీ, జైపూర్‌కు కె.రమేష్, బెల్లంపల్లికి బి.సుధాకర్, మంచిర్యాలకు కె.వై.ప్రసాద్, కాసిపేటకు వేణుగోపాల్, కన్నెపల్లికి దత్తు ప్రసాద్‌రావు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌గా సునిల్‌కుమార్, కలెక్టరేట్ ప్రొటోకాల్ సూపరింటెండెంట్‌గా సాయిబాబు, బెల్లంపల్లి ఆర్డీఓ ఆఫీస్ డీఏఓగా మధుసూదన్‌లను కేటాయించారు.

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఈఓ యాదయ్య

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులను ఉత్తమ క్రీడకారులుగా తీర్చిదిద్దాలను డీఈవో యాదయ్య వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో 2023–24 అకాడమిక్ ఇయర్ స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ఉత్తమ జట్టును ఎంపిక చేసి జోనల్ పోటీలకు పంపించాలని తెలిపారు. డీవైఎస్‌వో బొబ్బిలి శ్రీకాంత్‌రెడ్డి, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

తొలిమెట్టుపై అవగాహన

నస్పూర్: నస్పూర్, మంచిర్యాల మండలాల్లో ఉపాధ్యాయులకు మౌలిక భాషా గణిత సామర్థ్యంపై తొలిమెట్టు కార్యక్రమం నస్పూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్‌ఎం సుధారాణి పాల్గొన్నారు.

అంకితభావంతో సేవలందించాలి

మంచిర్యాలఅర్బన్: ప్రత్యేక అవసరాల పిల్లలకు అంకితభావంతో సేవలందించాలని డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం మంచిర్యాలలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ)లతో సమీక్షా నిర్వహించారు. ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్ చౌదరి, క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.


నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

మంచిర్యాలటౌన్: జిల్లాలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1 నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ మాత్రలను తినిపించాలని తెలిపారు. మాత్రలు వేసుకోని వారికి ఈ నెల 10న మాప్ అప్ డే నిర్వహించి మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కళ్ల కలక ఉన్నవారికి, తగ్గిన తరువాతనే తినిపించాలని, మాత్రలను ఇంటికి ఇవ్వవద్దని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవని తెలిపారు.

గళమెత్తాలి..!

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శాసనసభ, మండలిలో జిల్లా పరిధిలోని నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ తమ గళమెత్తి ఇక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రభుత్వంలో ఇవే చివరి సమావేశాలు కావడంతో నిధుల విడుదలపై ఆశలు పెట్టుకున్నారు. రెండు నెలల్లో శాసనసభ ఎన్నికల ప్రక్రియ మొదలు కానుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేలా రెండు సభల్లో ప్రజాప్రతినిధులు తమ గళం విప్పాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, మంచిర్యాల



బాల్క సుమన్

దివాకర్ రావు

రేఖానాయక్



దుర్గం చిన్నయ్య

ఎమ్మెల్సీ దండే విఠల్

- జిల్లా ప్రజాప్రతినిధులపైనే ప్రజల గంపెడాశలు
- ఈ ప్రభుత్వంలో ఇవే చివరి అసెంబ్లీ సమావేశాలు
- వరదల నష్టం, అభివృద్ధి, సంక్షేమంపై విన్నపాలు
- నేటి నుంచే శాసన సభ, మండలి సమావేశాలు

వరదలతో ఏటా నష్టం

జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఖానాపూర్(జన్నారం) నియోజకవర్గాల్లో ఏటా వానాకాలంలో వరదలతో తీవ్ర నష్టం జరుగుతోంది. గత మూడేళ్లుగా సగటున 35వేల ఎకరాల్లో పంటలపై ప్రభావం పడుతోంది. గోదావరి, ప్రాణహిత నదీతీరాల్లో ఉన్న పంట చేన్లను రైతులు నష్టపోవాల్సి వస్తోంది. పరిహారం అందకపోవడమే కాకుండా భవిష్యత్‌లో మళ్లీ పంటలు వరద నీట మునగకుండా ప్రత్యామ్నాయ చర్యలపై చొరవ చూపడం లేదు. ముఖ్యంగా మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో గోదావరి బ్యాక్ వాటర్‌తో మంచిర్యాల, నస్పూర్ పట్టణాలు, జైపూర్, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లుతోంది. రైతులు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి ఆర్థికంగా దెబ్బతింటున్నారు.

అభివృద్ధికి నిధుల లేమి..

జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు, 311గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అరకొర నిధులతో పట్టణ, గ్రామ పాలకవర్గాలు నెట్టుకొస్తున్నాయి. 147 గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేవు. మున్సిపాలిటీల్లోనూ అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. పట్టణాల్లో మౌలిక వసతుల లేమి, రోడ్లు, డ్రైనేజీ, అభివృద్ధి పనుల నిర్వహణలో వెనుకబడుతున్నాయి. జిల్లా కేంద్రం, బెల్లంపల్లి వంటి పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందడం లేదు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ ప్రతిపాదనలకే పరిమితమైంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన వసతులు లేక జిల్లా ఆసుపత్రిపై ఆధారపడాల్సి వస్తోంది. వైద్యులు, సిబ్బంది సరిపడా లేక డిప్యూటేషన్లు, సర్దుబాటు చేస్తూ నెట్టుకొస్తున్నారు. మంచిర్యాల పట్టణంలో ఆశవర్కర్లే లేకుండా కొనసాగుతోంది. మెడికల్ కాలేజీ, గోదావరి నదిపై వంతెన పనులు వేగం పెంచాల్సి ఉంది. ఇక వరదలతో నష్టపోయి మాతాశిశు సంరక్షణ ఆస్పత్రికి ప్రత్యామ్నాయం చూపాల్సి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు, చెరువులు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. తక్షణం మరమ్మతులకు నిధులు విడుదల చేయాల్సి ఉంది.

సంక్షేమానికి నిధులు అవసరం

జిల్లాలో దళితబంధు, గొర్రెల పంపిణీ, బీసీ కార్పొరేషన్ రుణాలు ప్రభుత్వం అందించడంలో జాప్యం జరుగుతోంది. కేసీఆర్ కిట్ పథకంలో గర్భిణులకు నగదు, రైతుబంధు తదితర వాటి అమలు కోసం ఎదురు చూస్తున్నారు. సింగరేణి కార్మికులకు వైద్య సదుపాయాల పెంపు, కార్మిక వాడల్లో సదుపాయాలు పెంచాల్సి ఉంది.

సాగునీటికి తప్పని గోస

ఇటు గోదావరి, అటు ప్రాణహిత నదులు నిండుగా ప్రవహిస్తున్నా ఆ నీటిని వాడుకోలేని దుస్థితి. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు, చెరువులు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. తక్షణం మరమ్మతులకు నిధులు విడుదల చేయాల్సి ఉంది. భారీ సాగునీటి ప్రాజెక్టు లేక అధికంగా వర్షాధారం, బోర్లు, బావులు, చెరువులపై రైతులు ఆధారపడాల్సి వస్తోంది. గూడెం ఎత్తిపోతలు పైపుల నిర్వహణ లోపం ఉంది. ఇక చెన్నూరు, బెల్లంపల్లికి సాగునీటి ప్రాజెక్టులు లేవు. చెన్నూరు ఎత్తిపోతలకు గత జూన్‌లో ప్రారంభించినా ఇంకా పనులేవి మొదలు కాలేదు.

రోడ్లబాగుకు నిధులు

బెల్లంపల్లి నియోజకవర్గంలో ఇటీవల వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. వాటిని బాగు చేసేందుకు నిధులు ఇవ్వాలని సభ దృష్టికి తీసుకెళ్తా. నియోజకవర్గంలో పెండింగ్ సమస్యల కృషికి సభలో చర్చిస్తా.

– దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్యే, బెల్లంపల్లి

ఎట్టకేలకు రుణమాఫీ

- ఇప్పటివరకు రూ.50 వేలలోపు మాఫీ
- బ్యాంకు రుణాలు రెన్యూవల్ చేసుకున్న రైతులు



రుణాల కోసం నెన్నెల గ్రామీణబ్యాంకు వద్ద రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎప్పుడెప్పుడా అని ఐదేళ్లుగా ఎదురు చూస్తున్న రూ.లక్ష రుణమాఫీ ప్రకటనతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొందరు అప్పు చేసి రుణం రెన్యూవల్ చేసుకోగా.. మరికొందరు ప్రభుత్వం మాఫీ చేస్తుందని ఎదురు చూస్తున్నారు. 2021 వానాకాలానికి ముందు రూ.25వేలు, రూ.50వేలులోపు తీసుకున్న రుణం మాఫీ అయింది. 2018 డిసెంబర్ 7వ తేదీలోపు రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులకు వడ్డీతో సహా మాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ గడవులోపు జిల్లాలో 92,481 మంది బ్యాంకుల నుంచి రూ.9,015 కోట్ల రుణాలు పొందారు. 2020 ఏప్రిల్‌లో రూ.25 వేలు మాఫీ అయిన రైతులు 11,062 మంది, 2021 జూన్‌లో రూ.50 వేలు మాఫీ అయిన వారు 6,426 మంది ఉన్నారు. అంతకంటే ఎక్కువగా రుణం తీసుకున్న వారి విషయంలో ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ ఆరంభంలో తీసుకున్న రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని, మాఫీ సొమ్ము వస్తే ఖాతాలో జమ అవుతుందని బ్యాంకర్లు సూచించడంతో వడ్డీతో సహా చెల్లించి తిరిగి కొత్త రుణాలు పొందారు.

ఖజానాకు ‘కిక్’ రెడీ

- నూతన మద్యం పాలసీ మార్గదర్శకాలు
- గౌడ్స్, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల ఖరారు
- నేడు ఆయా దుకాణాల గుర్తింపునకు కలెక్టర్ల సమక్షంలో లాటరీలు
- రేపు టెండర్ నోటిఫికేషన్
- ఎక్సైజ్ శాఖ కసరత్తు

సాక్షి,ఆదిలాబాద్: నూతన మద్యం పాలసీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. గౌడ్స్, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ చేసిన దుకాణాల సంఖ్యను ప్రకటించింది. గౌడ్స్‌కు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం కేటాయించింది. గురువారం ఆయా దుకాణాల గుర్తింపునకు సంబంధించి కలెక్టర్ల సమక్షంలో లాటరీ తీయనున్నారు. శుక్రవారం టెండర్ నోటిఫికేషన్ జారీ కానుంది. ఇందుకోసం ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది. కాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 192 మద్యం దుకాణాలు ఉండగా, 135 జనరల్‌కు కేటాయించగా, 57 దుకాణాలకు రిజర్వేషన్ కల్పించారు.

ముందస్తుగా టెండర్లు..

ప్రభుత్వం 2023–25 కోసం నూతన మద్యం పాలసీకి సంబంధించి టెండర్ నోటిఫికేషన్‌కు సిద్ధమైంది. గతంలో అంటే.. 2021–23 సంవత్సరానికి సంబంధించి నవంబర్ 2021లో టెండర్లు నిర్వహించింది. నూతన పాలసీకి సంబంధించి కూడా వచ్చే నవంబర్‌లో టెండర్లు నిర్వహించవచ్చని లిక్కర్ వ్యాపారులు భావించారు. అయితే ఆ సమయంలో ఎన్నికల కోడ్ అమలైతే ఈ టెండర్లు నిర్వహించేందుకు అవకాశం ఉండదని భావించిన ప్రభుత్వం ముందస్తుకు సిద్ధమైంది. ప్రస్తుతం కొనసాగుతున్న మద్యం దుకాణాల గడువు నవంబర్ 30తో పూర్తవుతుంది. కొత్త పాలసీలో దుకాణాలు దక్కించుకునే వ్యాపారులు వచ్చే డిసెంబర్ 1 నుంచి వాటిని తెరవాల్సి ఉంటుంది.



దుకాణంలో మద్యం స్టాక్

ఉమ్మడి జిల్లాలో వైన్స్ షాపుల వివరాలు (రిజర్వేషన్, జనరల్ వారీగా)

జిల్లా	వైన్స్‌ల సంఖ్య	రిజర్వేషన్			జనరల్ ఇలా..
		గౌడ్స్	ఎస్సీ	ఎస్టీ	
ఆదిలాబాద్	40	01	05	09	25
కుమురంభీం	32	02	04	05	21
మంచిర్యాల	73	06	10	06	51
నిర్మల్	47	03	05	01	38
మొత్తం	192	12	24	21	135



అప్పట్లో ఆదాయం ఇలా..

రెండేళ్ల క్రితం టెండర్ల ద్వారా ప్రభుత్వానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.58.8 కోట్ల ఆదాయం లభించింది. ఆ పాలసీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,940 దరఖాస్తులు రాగా, పైన పేర్కొన్న ఆదాయం వచ్చింది.

- ఆదిలాబాద్ జిల్లాలో 40 షాపులకు గాను 591 దరఖాస్తులు రాగా, రూ.11.82 కోట్ల ఆదాయం లభించింది.
- మంచిర్యాలలో 73 షాపులకు 1170 దరఖాస్తులు రాగా, రూ.23.40 కోట్ల ఆదాయం సమకూరింది.
- నిర్మల్‌లో 47 షాపులకు గాను 556 దరఖాస్తులు రాగా రూ.11.12 కోట్ల ఆదాయం వచ్చింది.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 32 షాపులకు గాను 623 దరఖాస్తులు రాగా, రూ.12.46 కోట్ల ఆదాయం లభించింది.

అధికారులు మారినా.. దళారీ వ్యవస్థ మారేనా?

- రెవెన్యూ శాఖలో చక్రం తిప్పుతున్న దళారులు
- భూ వివాదాల్లో వారి సెటిల్మెంట్లే అధికారులకు ఫైనల్
- కొత్త అధికారుల రాకతోనైనా మార్పు వచ్చేనా..?

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వచ్చే శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని రెవెన్యూ అధికారులను బదిలీ చేశారు. తహసీల్దార్ కేడర్ నుంచి ఆర్డీవో, అదనపు కలెక్టర్ల వరకు అందరూ బదిలీ అయ్యారు. దాదాపు జిల్లాలో అన్ని చోట్ల కొత్త రెవెన్యూ అధికారులే విధుల్లో చేరారు. అధికారులు మారినా దళారీ వ్యవస్థ మారడం లేదనే ఆరోపణలను రెవెన్యూ శాఖ మూటగట్టుకోవాల్సి వస్తోంది. జిల్లాలో ఇప్పటికీ అనేక వివాదాస్పద భూముల సెటిల్మెంట్లలో దళారుల దందా నడుస్తూనే ఉంది. జిల్లా కేంద్రం నుంచి మారుమూల ప్రాంతాల వరకు కుటుంబ, వారసత్వ, గెట్ల తగాదాలు, అసైన్డ్, సీలింగ్, అటవీ, బీడీపీపీ, భూ సేకరణ, పరిహారం వంటి అనేక భూ వివాదాలు ఉన్నాయి. ఇలాంటి అన్ని పనులు రెవెన్యూ కార్యాలయాల్లో దళారులే సెటిల్ చేస్తున్నారు.

ఆర్డీవో కార్యాలయం అడ్డా

జిల్లాలో మంచిర్యాల రెవెన్యూ డివిజన్ అధికారి పరిధి పెద్దది. చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాలు ఈ కార్యాలయం పరిధిలోనే ఉన్నాయి. సింగరేణి, సాగునీటి, జాతీయ రహదారులు, ప్రజోపయోగార్థం సేకరించిన భూములకు సంబంధించిన వందల ఎకరాల్లో రూ.కోట్లలో పరిహారం చెల్లింపులు జరుగుతున్నాయి. అర్హులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఇల్లు, జాగా, మేజర్‌సన్ పరిహారం తదితర వన్నీ కల్పించే ‘అవార్డు’ పాస్ చేయడం ఆర్డీవో పరిధిలోనే ఉంటాయి. వీటిని ఆసరా చేసుకుని దళారులు రంగప్రవేశం చేసి అందినకాడికి దండుకుంటున్నారు. సింగరేణి ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీల్లో రూ.కోట్ల పరిహారం చెల్లించింది. ఇందులో వివాదాస్పద భూములు, అవార్డు ఎవరికి ఇవ్వాలో తేలకుండా మిగిలిపోయిన వివాదాస్పదమైన వాటిలో దళారులు చక్రం తిప్పుతున్నారు. ఇక జిల్లా కేంద్రంతోపాటు నస్పూర్ పట్టణ శివారులో భారీగా సర్కారు భూముల్లో వందల ఎకరాలు కబ్జాల పాలయ్యాయి. వీటిని నిలువరించకపోగా.. కొందరు అధికారులే సహకరించి అక్రమాలకు బాట వేశారు. రియల్ ఎస్టేట్‌కు డిమాండ్ ఉండడంతో సివిల్ వివాదాలు, రెవెన్యూ కోర్టు పరిధిలో ఉన్న తగాదాల లొసుగులతో దళారులు ‘మీకు పని చేయిస్తాం’ అంటూ పైసలు దండుకుంటున్నారు. రాజకీయ, అధికార పార్టీ పలుకుబడి ఉన్న నాయకులు సైతం ఇందులో భాగస్వాములు అవుతున్నారు. దళారులనే వెంటబెట్టుకుని రెవెన్యూ అధికారులు బాహాటంగా తిరగడం ఒక్క మంచిర్యాలలో కనిపిస్తుంది. అధికారుల వ్యక్తిగత పనులు చేస్తూ వారికి అవసరమైనవి ఎరగా వేస్తూ తమ బుట్టలో వేసుకుంటున్నారు. ఇటీవల శ్రీరాంపూర్ ఓసీపీ పరిహారంలో అనేక అక్రమాలు జరిగినట్లు తాళ్లపల్లి, సింగాపూర్, దుబ్బపల్లి, రామారావు పేట పరిధిలో ఉన్నవారు ఫిర్యాదులు సైతం ఇచ్చా రు. సింగపూర్, దుబ్బపల్లిలో అధికారుల పేర్లు చెప్పి నిర్వాసితుల నుంచి రూ.లక్షలు వసూలు చేశారు. ఈ క్రమంలో తాజాగా జిల్లాకు బదిలీపై వచ్చిన అధికారులు దళారుల అక్రమాలను ఎలా అరికడుతారో వేచి చూడాలి.

క్రిస్టియన్, మైనారిటీలకు రూ.లక్ష సాయం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రారంభం
- ఈ నెల 14వరకు గడువు

మంచిర్యాలటౌన్: మైనార్టీలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర మైనార్టీల ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వంద శాతం రాయితీతో రూ.లక్ష ఆర్థిక సాయానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 14వరకు http://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 45,600 మంది మైనార్టీలు ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య లక్షకు పైగా ఉంటుంది. వీరిలో ఎక్కువగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారే ఉన్నారు. మైనార్టీల్లో ముస్లింలు, క్రిస్టియన్లు, జైనులు, బుద్ధిస్టులు, సిక్కులు, పార్శీ తెగలకు చెందిన కుటుంబాలు ఉన్నాయి. ముస్లింలు, క్రిస్టియన్లు ఎక్కువగా ఉండగా.. ఈ ఏడాది జనవరిలో రూ.లక్ష రుణం తీసుకున్న వారికి 80శాతం రాయితీ, రూ.2లక్షల రుణానికి 70శాతం రాయితీ అందించేందుకు దరఖాస్తులు స్వీకరించగా.. 2,709 మంది ముస్లింలు దరఖాస్తు చేసుకున్నారు. అర్హుల జాబితా సిద్ధం చేయకపోవడంతో రుణాలు అందించలేదు. వారందరినీ రూ.లక్ష సాయం కిందికి తీసుకు రానుండగా.. ముస్లింల నుంచి దరఖాస్తులు స్వీకరించడం లేదు. కేవలం కిస్టియన్ల నుంచి మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం కల్పించారు. జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 7,912 మంది క్రిస్టియన్లు ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య రెట్టింపుగా ఉంటుందని అధికారుల అంచనా.



జిల్లా మైనారిటీ కార్యాలయం

అర్హతలు..

దరఖాస్తుదారు క్రైస్తవ మైనార్టీ కమ్యూనిటీకి చెందిన వారై 21నుంచి 55ఏళ్ల మధ్య వయస్కులై ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.150లక్షలు, పట్టణాల్లో రూ.2లక్షలకు మించకుండా ఉన్న ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉండాలి. తహసీల్దార్ మంజూరు చేసిన బీసీ–సీ సర్టిఫికెట్/చర్చి పాస్టర్ మంజూరు చేసిన బాప్టిజం సర్టిఫికెట్ కలిగి ఉండాలి. గతంలో ఆర్థికసాయం పొందిన వారు అనర్హులు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని క్రిస్టియన్ మైనారిటీ ప్రజలు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది జనవరిలో దరఖాస్తు చేసుకున్న ముస్లింలను రూ.లక్ష సాయం కిందకు మార్చి, వారిలో అర్హులైన వారికి లక్ష సాయం అందిస్తాం.

– నీరటి రాజేశ్వరి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి

కేసీఆర్ అనాలోచిత నిర్ణయంతోనే నష్టం

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్
- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన

మంచిర్యాలటౌన్/చెన్నూర్‌రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు తానే గొప్ప ఇంజినీర్ అనుకుని అనాలోచిత నిర్ణయం వల్ల కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్లనే మూడేళ్లుగా బ్యాక్‌వాటర్‌తో మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల రైతులు, ప్రజలు నష్టపోతున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి విమర్శించారు. ఇటీవల వరదల్లో మునిగిన మంచిర్యాలలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీ, చెన్నూర్ మండలం సుందరసాలలో ముంపునకు గురైన పంటలను బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లితో కలిసి పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. అనంతరం వివేక్ మాట్లాడుతూ మంచిర్యాలలోని వరద ముంపు బాధిత కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. మరోసారి వరదలు రాకుండా రాళ్లవాగుకు కరకట్ట కట్టి శాశ్వత పరిష్కారం చూపించాలని అన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కేటాయించాలని తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు అందుగుల శ్రీనివాస్, అమిరిశెట్టి రాజు, తోట మల్లిఖర్జున్, బోయిని హరికృష్ణ, బుద్దారపు రాజమౌళి, పట్టి వెంకటకృష్ణ పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌నగర్‌లో మాట్లాడుతున్న వివేక్

కేంద్ర బృందం తనిఖీలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని టీబీ కేంద్రాన్ని కేంద్ర బృందం సభ్యులు బుధవారం తనిఖీ చేశారు. పరీక్షల తీరును పరిశీలించడంతోపాటు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, బాధితులకు ఇచ్చే మందుల వివరాలు కంప్యూటరీకరణ చేస్తున్నారో లేదో పరిశీలించారు. ల్యాబ్‌లో పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదో తెలుసుకున్నారు. టీబీ కేంద్రంలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది పనితీరును బృందం సభ్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ల్యాబ్ సైంటిస్టు డాక్టర్ శివకుమార్, హైదరాబాద్ టీబీ ఎపడమాలజిస్టు అధికారి డాక్టర్ సుమలత, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఫయాజ్‌ఖాన్, జిల్లా నోడల్ అధికారి సాయిరెడ్డి, హెచ్‌ఈవో నాగభూషణం పాల్గొన్నారు.



టీబీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న బృందం

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

కాసిపేట: పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ సూచించారు. బుధవారం మండలంలోని సోమగూడెం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా, సంక్షిప్త సవరణ పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను అధికారులు సమన్వయంతో పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. 1300ఓటర్లు పైచిలుకు ఉన్న పోలింగ్ కేంద్రం సమీపంలో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తహసీల్దార్ దిలీప్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్‌: కాగజ్‌నగర్‌ రైల్వే స్టేషన్‌ సమీపంలోని రాళ్లగూడ రైల్వే క్యాబిన్‌ వద్ద బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు కాగజ్‌నగర్‌ జీఆర్‌పీ స్టేషన్‌ హౌస్‌ ఆఫీసర్‌ సురేష్‌ గౌడ్‌ తెలిపారు. మృతుడు నీలిరంగు జీన్స్‌ ప్యాంటు, నేవీ బ్లూ కలర్‌ టీషర్ట్‌ ధరించాడని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని సిర్పూర్‌(టి) సామాజిక ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు ఆయన తెలిపారు.

తండ్రీకొడుకులపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్‌: మండలంలోని నజ్రూల్‌నగర్‌ విలేజ్‌ నెం.5 గ్రామానికి చెందిన శ్యామల్‌ సర్దార్‌, ధీరజ్‌ సర్దార్‌లపై మంగళవారం రాత్రి దాడి చేసిన జయదేవ్‌ రాయ్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై రమేష్‌ కుమార్‌ తెలిపారు. జయదేవ్‌కు చెందిన టెంట్‌ హౌజ్‌ వెనుకభాగంలో మూత్ర విసర్జనకు వెళ్లడంతో అదే విషయంలో వారి మధ్య గొడవ జరిగింది. గొడవ తీవ్రస్థాయికి చేరడంతో తండ్రీకొడుకులు శ్యామల్‌, ధీరజ్‌లపై జయదేవ్‌ ఇనుపరాడ్‌తో దాడికి పాల్పడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు జయదేవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో పడి మహిళ మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్‌): మండలంలోని ఎడవెల్లి శివారులో వాగులో పడి అదే గ్రామానికి చెందిన రాథోడ్‌ గాయత్రి అనే మహిళ మృతి చెందినట్లు ఎస్సై భూమేష్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన రాథోడ్‌సంపత్‌, గాయత్రి దంపతులు ఆరేళ్లుగా ఎడవెల్లిలోనే ఉంటూ ప్లాస్టిక్‌ డబ్బాలు, కవర్లు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఊరి బయట ఉన్న వాగులో బట్టలు ఉతికేందుకు వెళ్లిన గాయత్రి తిరిగి ఇంటికి రాలేదు. సంపత్‌ చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం వీఆర్‌ఏ దుర్గం రాజేశ్వర్‌ వాగు వైపు వెళ్తుండగా మృతదేహం కనిపించడంతో సర్పంచ్‌ కార్తీక్‌ ద్వారా సంపత్‌కు సమాచారం అందించాడు. మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



రోహిత్‌(ఫైల్‌)

తాంసి: ప్రేమించిన యువతితో కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన భీంపూర్‌ మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం భీంపూర్‌ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన రోహిత్‌ (24) వ్యవసాయం చేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. యువతి కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మెరుగైన వైద్యం.. అందని దైన్యం..!

- 250 పడకలతో ప్రారంభించిన ఏరియా ఆస్పత్రి
- 75 పడకలకు పడిపోయిన వైనం
- కరువైన స్పెషలిస్టు వైద్యులు
- మూడేళ్లుగా నిలిచిన ప్రసూతి సేవలు



బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి భవనం

బెల్లంపల్లి: సింగరేణి కార్మికులు, కుటుంబ సభ్యులకు అందుబాటులో మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో బెల్లంపల్లిలో నిర్మించిన సింగరేణి ఏరియా ఆస్పత్రి నిర్వహణ గాడి తప్పింది. అధునాతన వైద్యం సంగతి దేవుడెరుగు.. కనీస వైద్యసేవలు కూడా రోగులకు అందని పరిస్థితి. మూడున్నర దశాబ్దాల క్రితం బెల్లంపల్లిలో సింగరేణి యాజమాన్యం దాదాపు 250 పడకల సామర్థ్యంతో ఏరియా ఆస్పత్రిని ప్రారంభించింది. ప్రస్తుతం ఆస్థాయి 75 పడకలకు కుదించినట్లు తెలుస్తోంది.

నిలిచిన ప్రసూతి సేవలు

ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు ప్రసూతి సేవలు నిలిచిపోయాయి. మూడేళ్లుగా ఆస్పత్రిలో ప్రసవాలు జరగడం లేదు. కరోనా వైరస్‌ ప్రబలిన క్రమంలో ఇక్కడ విధులు నిర్వహించిన గైనకాలజిస్టును మరో ఆస్పత్రికి బదిలీ చేశారు. ఇటీవల గైనకాలజిస్టు పోస్టును భర్తీ చేసినా ఆస్పత్రిలో డెలివరీ కేసులు జరగడం లేదు. కొత్తగా నియామకమైన గైనకాలజిస్టు కొన్నిరోజులు విధులు నిర్వహించి ఇటీవల దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లారు. మరోవైపు మత్తు డాక్టర్‌ పోస్టు కూడా ఖాళీగా ఉంది. దీంతో ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు ప్రసవాలు జరగని ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. అత్యవసరంగా గర్భిణులను రామకృష్ణాపూర్‌ ఏరియా ఆస్పత్రికి పంపిస్తున్నారు. అందుబాటులో ఆస్పత్రి ఉన్నా సేవలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గర్భిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆపరేషన్‌ థియేటర్‌కు ఆధునీకరించినా..

ఏరియా ఆస్పత్రిలో ఉన్న ఆపరేషన్‌ థియేటర్‌కు ఇటీవల రూ.లక్షలు వెచ్చించి మరమ్మతు చేయించారు. అన్ని విధాల ఆపరేషన్‌ థియేటర్‌ను ఆధునీకరించినా ఎందుకూ కొరగాకుండా పోతోంది. దీంతో 'అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని 'అన్న చందంగా తయారైంది ఆస్పత్రి పరిస్థితి.

స్పెషలిస్టు వైద్యులేరీ...?

ఆస్పత్రిలో స్పెషలిస్టు వైద్యుల పోస్టులను భర్తీ చేస్తామని ఏళ్ల తరబడి ప్రకటిస్తున్నా చిత్తశుద్ధితో ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. జనరల్‌ ఫిజీషియన్‌, కార్డియాలజిస్టు, ఆర్థోసర్జన్‌, డెంటిస్టు, స్కిన్‌ స్పెషలిస్టు, నేత్ర వైద్యనిపుణులు, ఈఎన్‌టీ, తదితర స్పెషలిస్టు వైద్యులను నియమించక పోవడంతో ఆస్పత్రి ఉపయోగం లేకుండా పోతోందని కార్మికులు పేర్కొంటున్నారు. వైద్యుల కొరతకు తోడు సిబ్బంది పోస్టులు సైతం భర్తీ కావడం లేదు.

ఇటీవలే నియామకాలు చేపట్టారు

సింగరేణిలో ఇటీవలే కొత్త డాక్టర్ల నియామకాలు చేపట్టారు. కంపెనీ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆస్పత్రులకు డాక్టర్లను పంపిస్తారని భావిస్తున్నాం. కొత్త డాక్టర్ల రాకకోసం ఎదురు చూస్తున్నాం. ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న మత్తు డాక్టర్‌ ఉద్యోగానికి రాజీనామా చేసాడు. గైనకాలజిస్ట్‌ మరో 45 రోజుల పాటు సెలవు పెట్టారు.

– శౌరి, డీవైసీఎంవో, ఏరియా ఆస్పత్రి, బెల్లంపల్లి

సంఘాలకేదీ శ్రద్ధ..

కార్మికవర్గానికి సరైన రీతిలో వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవడంలో, సింగరేణి యాజమాన్యాన్ని ఒప్పించడంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు తీవ్ర నిర్లిప్తత ప్రదర్శిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఏరియా ఆసుపత్రి స్థితిగతులను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వైద్యసేవలు సరిగా అందేలా చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో లేనిపోని ఆశలు కల్పించి, ఆచరణలో విస్మరిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు.

డిపో నిర్మాణం విరమించుకోవాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్‌ నాయకులు

చెన్నూర్‌: పట్టణంలోని జాతీయ రహదారి సమీపంలో దళితుల భూమిలో బస్‌డిపో నిర్మాణాన్ని విరమించుకోవాలని కేవీపీఎస్‌ జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్‌ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిపో నిర్మాణానికి దళితుల భూములే దొరికాయా అని ప్రశ్నించారు. తహసీల్దార్‌ ఎమ్మెల్యేకు తప్పుడు సమాచారం ఇవ్వడంతోనే డిపో నిర్మాణానికి పునుకున్నారన్నారు. జిల్లా అధికారులు స్పందించి డిపో ఏర్పాటుపై సమగ్ర విచారణ జరిపి బాధిత మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో కేవీపీఎస్‌ మండల ఉపాధ్యక్షుడు జుమ్మిడి కుమార్‌, బాధిత మహిళలు మల్లేశ్వరి, పెద్ద రాజేశ్వరి, చిన్న రాజేశ్వరి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అడిషనల్‌ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్‌: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘం నాయకులు బుధవారం అడిషనల్‌ కలెక్టర్‌ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.5 వేల పెన్షన్‌ పథకం అమలు చేయాలని, ఈఎస్‌ఐ ఆస్పత్రి సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారికి డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని, అడ్డా భవన కార్మికులకు అడ్డాల వద్ద రేకుల షెడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతి కల్పించాలని, కార్మిక బంధు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బండారి సుధాకర్‌, పట్టణ అధ్యక్షుడు పడాల రామన్న, కార్యదర్శి చింతల మల్లేశ్‌, రాం రాజయ్య, మొగిలి సత్యం, ఎస్‌కె ఘని పాల్గొన్నారు.

శానిటేషన్‌ పనులు పరిశీలించిన డీఎల్‌పీవో



కంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

తాండూర్‌: మండలంలోని నీలాయపల్లి, తాండూర్‌ గ్రామ పంచాయతీల్లో బుధవారం బెల్లంపల్లి డివిజనల్‌ పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో) ఫణీందర్‌రావు పర్యటించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న పారిశుధ్యం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీగా చెత్త సేకరణ పనులు చేపట్టాలని, డ్రెయినేజీల్లో పూడిక తీయించాలని, సేకరించిన చెత్తను ట్రాక్టర్‌ ద్వారా డంపింగ్‌ యార్డుకు తరలించాలని, వర్మీకంపోస్టు ఎరువును పీపీవీ ఎవెన్యూ ప్లాంటేషన్‌లోని మొక్కలకు వేయాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. తాండూర్‌ గ్రామ పంచాయతీలో రోడ్డుపక్కన ఉన్న చెత్తను తొలగించక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నీలాయపల్లి గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం లేకుండా చర్యలు

- సింగరేణి సీఅండ్‌ఎండీ శ్రీధర్‌



మాట్లాడుతున్న సీఅండ్‌ఎండీ శ్రీధర్‌

నస్పూర్‌: ఇటీవల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సింగరేణి సీఅండ్‌ఎండీ శ్రీధర్‌ సూచించారు. బుధవారం జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వలన బొగ్గు ఉత్పత్తిలో రవాణాలో ఎలాంటి లోపాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి 720 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని దాటాలన్నారు. కొత్త గనులు ప్రారంభించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్‌ ఏరియా జీఎం సంజీవరెడ్డి, ప్రాజెక్టు అధికారులు ఎం.శ్రీనివాస్‌, పురుషోత్తంరెడ్డి, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

- టీబీజీకేఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

నస్పూర్‌: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సింగరేణి కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్‌ పెద్దపీట వేస్తున్నారని టీబీజీకేఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. బుధవారం ఆర్‌కే–5 గనిలో శ్రీ రాంపూర్‌ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన గేట్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య నియామకాలు, మెడికల్‌ ఇన్‌వాల్యుడేషన్‌ ద్వారా సుమారు 15 వేల మంది యువ కార్మికులు సింగరేణిలో పని చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులకు సొంతింటి నిర్మాణానికి రూ.10 లక్షల వడ్డీలేని రుణం, ఉద్యోగ విరమణ వయస్సు 61సంవత్సరాలు పెంచడం జరిగిందన్నారు. రూ.700ల కోట్ల లాభాలను ఈ సంవత్సరం కార్మికులకు పంచడం జరుగుతోందన్నారు. 2022 నాటికి ఉద్యోగంలోకి వచ్చిన కార్మికులకు 190 నుంచి 240 మస్టర్లు నిండిన ప్రతి బదిలీ వర్కర్‌కు నెల రోజుల్లో జనరల్‌ మజ్దూర్‌గా ఇప్పిస్తామన్నారు. అనంతరం రాజిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీసాయి దృష్టి అంధుల పాఠశాలలో కేక్‌ కట్‌ చేసి పండ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు దీకొండ అన్నయ్య, ఏరియా జీఎం చర్చల ప్రతినిధులు పెట్టం లక్ష్మణ్‌, కుమారస్వామి, మహిపాల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావ్‌, సత్యనారాయణ, సదయ్య, సమ్మయ్య, రాజేశం, మల్లారెడ్డి, సంతోష్‌, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలపై అసెంబ్లీలో చర్చించాలి



మల్లారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్‌: సింగరేణి కాంట్రాక్ట్‌ కార్మికుల వేతనాలపై అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ, ఎస్‌సీసీడబ్ల్యూయూ నాయకులు బుధవారం కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు డీ.బ్రహ్మానందం మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్ట్‌ కార్మికుల హక్కులు, సౌకర్యాల విషయంపై అసెంబ్లీలో చర్చించి వేతనాలు పెంచాలని డిమాండ్‌ చేశారు. సింగరేణిలో కాంట్రాక్టీకరణ ప్రారంభమై సుమారు 25 సంవత్సరాలు అవుతోందని, సింగరేణి వ్యాప్తంగా సుమారు 30 వేల మంది కార్మికులు వివిధ డిపార్ట్‌మెంట్లలో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. కాంట్రాక్ట్‌ కార్మికులను పర్మినెంట్‌ చేస్తానని సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. 2016లో సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం తెలంగాణ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు.

జీఎం రవిప్రసాద్‌ బాధ్యతల స్వీకరణ



జీఎం రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బెల్లంపల్లి ఏరియా నూతన జనరల్‌ మేనేజర్‌గా రవిప్రసాద్‌ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్టేట్స్‌ జీఎంగా విధులు నిర్వహించిన రవిప్రసాద్‌ను యాజమాన్యం బెల్లంపల్లి ఏరియాకు బదిలీ చేయగా గతంలో బీపీఏ జీఎంగా పనిచేసిన దేవేందర్‌ను జీఎం మార్కెటింగ్‌గా బదిలీ చేసింది. నూతన జీఎంను కార్యాలయ ఉద్యోగులు, అన్ని విభాగాల ఉన్నతాధికారులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జీఎం రవిప్రసాద్‌ కార్యాలయంలో ఉన్న పలు డిపార్టుమెంట్లను పరిశీలించి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు.


బొగ్గు ఉత్పత్తిపై జీఎం సమీక్ష



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్‌: శ్రీరాంపూర్‌ ఏరియాలోని గనులలో బొగ్గు ఉత్పత్తిపై ఏరియా జీఎం సంజీవ్‌రెడ్డి ఆయన కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌ హాల్‌లో బుధవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై మాసంలో సాధించిన ఉత్పత్తిపై సమీక్షించి ఆగస్టులో సాధించాల్సిన ఉత్పత్తిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ ఎం.శ్రీనివాస్‌, ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్‌ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీ ఏజెంట్‌ గోపాల్‌సింగ్‌, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, డీజీఎం సీహెచ్‌పీ డీవీరావ్‌, ఏరియా స్టోర్స్‌ డీజీఎం యాదయ్య పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలు తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో



విద్యాబోధన చేస్తున్న ఐటీడీఏ పీవో

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని ఆశ్రమ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్‌ బాజ్‌పాయ్‌ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లోని పరిసరాలు, వంటగది, తరగతి గదులు సౌకర్యాలను పరిశీలించారు. మౌళిక సదుపాయలు, విద్యాబోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాలికల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు గణితం, బాలుర పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల పాఠాలు బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గఫూర్‌, క్రీడాధికారి బండ జీవరత్నం, శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్‌

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బొగ్గు గని కార్మికులకు సంబంధించిన 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్‌ను సింగరేణి కార్మికులకు సెప్టెంబర్‌లో అందించే అవకాశం ఉంది. సెప్టెంబర్‌ నెలలో చెల్లించబోయే వేతనంతో కలిసి 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్‌ను సింగరేణి కార్మికులకు చెల్లించాలని సింగరేణి డైరెక్టర్‌ (పా), డైరెక్టర్‌ ఫైనాన్స్‌లకు కోల్‌ ఇండియా ఉన్నతాధికారి గౌతమ్‌బెనర్జీ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

లక్కేరావు మరణం పార్టీకి తీరని లోటు



చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

ఇంద్రవెల్లి(ఖానాపూర్‌): బీఆర్‌ఎస్‌ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్‌ కనక లక్కేరావ్‌ అకాల మరణం పార్టీకి తీరనిలోటని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మగూడకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్కేరావ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో బాధిత కుటుంబ పరిస్థితి గురించి సీఎం కేసీఆర్‌, మంత్రి కేటీఆర్‌ దృష్టికి తీసుకెళ్తానన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లక్కేరావ్‌ మరణం పార్టీ కార్యకర్తలకు కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల సంప్రదాయ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత పార్టీ ఆధ్వర్యంలో సంతాపసభ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు మహ్మద్‌ అంజద్‌ పాల్గొన్నారు.

శాంతిఖని గని మ్యాగజిన్‌ స్టోర్‌ రూమ్‌కు తాళం



శాంతిఖని గని మ్యాగజిన్‌ రూమ్‌

బెల్లంపల్లి: మందమర్రి ఏరియాలోని శాంతిఖని గని మ్యాగజిన్‌ స్టోర్‌ రూమ్‌కు తాళం వేసి ఉంచడంతో కార్మికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడురోజులుగా ఎక్స్‌ప్లోజివ్స్‌, డిటోనేటర్ల సరఫరా నిలిపి వేయడంతో మ్యాగజిన్‌ను మూసివేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న యాక్టింగ్‌ క్లర్క్‌ , మరో ముగ్గురు జనరల్‌ మజ్దూర్‌ కార్మికులకు స్టోర్‌ వద్ద డ్యూటీ కేటాయించకుండా గనికి సంబంధించిన పనులు కేటాయిస్తుండటంతో అనుమానాలు బలపడుతున్నాయి. మ్యాగజిన్‌ను మూసివేయడానికి చర్యలు తీసుకుంటున్నారనే అనుమానాలు కార్మికుల్లో వ్యక్తమవుతున్నాయి.

1954లో శాంతిఖని గని ప్రారంభం

శాంతిఖని గనిని 1954లో ప్రారంభించారు. అప్పటి నుండి నిరాటంకంగా గనిలో బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. గనిలో బొగ్గు వెలికితీత కోసం వినియోగించే ఎక్స్‌ప్లోజివ్స్‌, డిటోనేటర్లను భద్రపర్చడానికి గని శివారు ప్రాంతంలో ప్రత్యేకంగా మ్యాగజిన్‌ గదిని నిర్మించారు. ఇందులో దాదాపు 3,200 కిలోల ఎక్స్‌ప్లోజివ్స్‌ , 44వేల వరకు డిటోనేటర్లను నిల్వ ఉంచవచ్చు. కాగా గని భూగర్భంలో ప్రస్తుతం టన్నెల్‌ బ్లాస్టింగ్‌ పనులు జరగడంలేదు. ఆ కారణంగానే మ్యాగజిన్‌ గదికి తాత్కాలికంగా తాళం వేశారనే మరో ప్రచారం కూడా జరుగుతోంది. ఈ విషయమై గని మేనేజర్‌ సంజయ్‌కుమార్‌ సిన్హాను 'సాక్షి' వివరణ కోరగా ప్రస్తుతం గని అవసరాలకు సరిపడా పేలుడు పదార్థాలు అందుబాటులో ఉన్నాయని, అందువల్ల తాత్కాలికంగా స్టోర్‌ రూమ్‌ మూసివేసామన్నారు. త్వరలోనే తెరుస్తామని, కార్మికులు అనుమానపడాల్సిన అవసరం లేదన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



కన్నెపల్లిలో పర్యటిస్తున్న డీపీవో

భీమిని: గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం కన్నెపల్లి, వీరాపూర్‌ గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. గ్రామ పంచాయతీలోని రికార్డులను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాల్లోని బృహత్‌ పల్లె ప్రకృతివనాలు, డంపింగ్‌యార్డులు పరిశీలించారు. డంపింగ్‌యార్డుల్లో తడి, పొడి చెత్తలను వేరుచేసి కంపోస్ట్‌ ఎరువును తయారు చేయాలన్నారు. ప్లాస్టిక్‌ వస్తువులను అమ్మి వచ్చిన డబ్బులను గ్రామపంచాయతీ అకౌంట్‌లో జమ చేయాలన్నారు. క్రిమిటోరియం చుట్టూ మొక్కలు నాటించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి సతీష్‌ కుమార్‌, సర్పంచులు పుల్లూరి సురేఖ, జిల్లెల ఆశోక్‌గౌడ్‌, పంచాయతీ కార్యదర్శులు అభిలాష్‌, తిరుపతి ఉన్నారు.

పశువులకు ఉచిత టీకాలు, మందులు



దండేపల్లి: పశువుకు టీకా వేస్తున్న పశువైద్యుడు

దండేపల్లి: మండలంలోని ముత్యంపేటలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాలతో పాటు, నట్టల నివారణ మందులు వేశారు. మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్‌, ఎంపీటీసీ ముత్తె రాజన్న, సర్పంచ్‌ విఠల్‌, ఉపసర్పంచ్‌ వెంకటేష్‌, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట, అంకతిపల్లి, ఊత్కూరు గ్రామాల్లో పోతపల్లి పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. వైద్యాధికారి శ్వేత, సిబ్బంది స్వామి, గంగమల్లు, అభిలాష్‌, నందగోపాల్‌, స్వాతి, ఇజాస్‌ పాల్గొన్నారు.

కోటపల్లి: కోటపల్లిలో పశువైద్యాధికారి పవన్‌కుమార్‌ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. సర్పంచ్‌ రాజక్క, నాయకులు స్వామి పాల్గొన్నారు.

భీమారం: బూర్గుపల్లిలో పశువులకు లంపీస్కిన్‌ వ్యాధి సోకకుండా ముందస్తుగా మండల పశువైద్యాధికారి డాక్టర్‌ రాకేశ్‌ శర్మ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. సిబ్బంది సంపత్‌, నర్సింహులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

జన్నారం: మండలంలోని చింతలపల్లిలో వైద్యాధికారి శ్రీకాంత్‌ పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. సిబ్బంది శిరిష, రెహమాన్‌, కిషన్‌, సంజీవ్‌, సాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): హాజీపూర్‌ మండలం పెద్దంపేటలో దొనబండ పశువైద్య ఆస్పత్రి ఆధ్వర్యంలో పశువైద్యాధికారి సరిత పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది అగ్నివేశ్‌, సికిందర్‌, కృష్ణ, రాకేశ్‌, రైతులు పాల్గొన్నారు.